నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
సోమవారం | జులై 22, 2024 | www.navatelangana.com

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల పతకాల పంట

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మంచిర్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో సహ తైక్వాండో క్లబ్ క్రీడాకారులు పతకాల పంటను పండించారు. మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలో అన్ని జిల్లాల నుండి దాదాపు వెయ్యి మందికి పైనే క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జిల్లా సహ తైక్వాండో క్లబ్‌కు చెందిన క్రీడాకారులు 10 బంగారం, 10 రజతాలు, 4 కాంస్య పతకాలు సాధించి తమ ప్రతిభను చాటారు. విజేతలకు రాష్ట్ర తైక్వాండో సంఘం అధ్యక్షుడు మూట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కురువ శ్రీహరి, జిల్లపెల్లి వెంకటస్వామి, తైక్వాండో కోచ్, జిల్లా తైక్వాండో సంఘం కార్యదర్శి అన్నారపు వీరేష్, అధ్యక్షుడు శివప్రసాద్, శ్రీ చైతన్య విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ గౌడ్, ఇన్‌చార్జీ వినోద్ జేసికపాలిన అభినందించారు.

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో వన మహోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ముందు భాగంలో ఆదివారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌తో పాటు ప్రముఖ వైద్యులు సత్యనారాయణ, తిప్పేస్వామి, చంపత్ రావు సిబ్బందితో కలిసి మొక్కలను నాటినీరు పోశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ మాట్లాడుతూ రిమ్స్‌ను హరితవనంగా మార్చటానికి వెయ్యి మొక్కలు నాటడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మొక్కల సంరక్షణకు అవసరమైన ఫెన్సింగ్ ఖర్చులు వైద్యుడు సత్యనారాయణ భరిస్తున్నట్లు పేర్కొన్నారు.

యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడి బరిలో రూపేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 5 నుంచి అక్టోబర్ 5 వరకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్ష బరిలో నియోజకవర్గానికి చెందిన సామ రూపేష్ రెడ్డి నిలుస్తున్నారు. ఈ మేరకు ఆయన గడువులోగా తన మెజార్టీని సాధించి అసెంబ్లీ అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యేందుకు ఆదివారం ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ దాఖలుక్ చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 35 సంవత్సరాలలోపు వారు తమ ఓటింగ్‌లో పాల్గొని ప్రత్యేక యాప్ ద్వారా తనను గెలిపించాలని కోరారు. వచ్చే నెల 5 నుంచి ప్రారంభమయ్యే ప్రచారంలో ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని యువతీ, యువకులు తనకు మద్దతుగా నిలవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుంజాల గ్రామానికి చెందిన యువతి ఆత్రం విజయలక్ష్మి డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న సమయంలో అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ ఆదివారం గుంజాల గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్రం విజయలక్ష్మి ఉన్నత చదువులు చదివి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం బాధాకరమన్నారు. కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు లోఖండే దేవ్ రావ్, నాయకులు జాకీరుల్లా ఖాన్, కొర్రేల మహేందర్ ఉన్నారు.

అగ్రవర్ణ నిరుపేదలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత మోడీదే



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అగ్రవర్ణ నిరుపేదలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకి దక్కుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన వెలమ ఎంప్లాయిస్, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. వెలమ కులస్తులు ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంత ఉందన్నారు. వెల్మ సంగమ అభివద్ధి తో పాటు కులస్తుల సమస్యల పరిష్కారానికి తలనంత కషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలమ కులస్తులు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి బోనాల జాతర



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహంకాళి బోనాల జాతరను ఆదివారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్‌సిల్క్‌లోని మహంకాళి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, శివాని దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే తన ఇంటి నుండి భాజాభజంత్రీలు, డప్పు వాయిద్యాలతో ఆలయానికి వెళ్లిన ఎమ్మెల్యే దంపతులు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. జాతర కమిటీ అధ్యక్షులు తుమ్మ రమేష్, మల్లిక దంపతులు మొదటి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్థానిక లారీ చౌక్ నుండి ఆలయం వరకు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పంపిణీ చేశారు. 12 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 5 లక్షల వరకు ఆర్థిక సాయం మంజూరు కాగా వీటిని ఎమ్మెల్యే తన నివాసంలో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి తావు లేకుండా తాను సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే మరో వంద మందికి చెక్కులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయివేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించుకున్న వారు తమ వైద్య ఖర్చుల బిల్లులను నేరుగా తనకు అందిస్తే తగు విధంగా ఆర్థిక సాయం మంజూరుకు కృషి చేస్తానన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం కోసం తనను సంప్రదిస్తే ఎల్‌ఓసీ ద్వారా వైద్యసహాయం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, వీరభద్రచారి, గణపతి, తిరుపతి, భిక్షపతి, గజ్జి ప్రసాద్, భగవంత్, కిరణ్, రాజు, సుమన్, బాబూరావు, శ్రీను పాల్గొన్నారు.

వర్షం వస్తే..వణుకే..!

- కొట్టుకుపోతున్న లోలెవల్ వంతెనలు, అప్రోచ్‌రోడ్లు
- అనేక గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- ఏటా వర్షాకాలంలో ఉత్పన్నమవుతున్న సమస్య
- శాశ్వత పరిష్కారానికి కనిపించని చర్యలు
- నూతన సర్కారు దృష్టిసారిస్తేనే ప్రయోజనం

వర్షాకాలం వచ్చిందంటే చాలా జిల్లా ప్రజలు వణికిపోతుంటారు. ఏ వంతెన ఎప్పుడు కొట్టుకుపోతుందోననే ఆందోళన చెందుతుంటారు. ప్రతి ఏటా ఈ సమస్య ఉత్పన్నమవుతున్నా శాశ్వత చర్యలు కనిపించడం లేదు. తాజాగా ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడం.. నదులు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. పలు చోట్ల లోలెవల్ వంతెనలు, రోడ్లు, అప్రోచ్ రోడ్లు వీటి దాటికి తట్టుకోలేక నామరూపాల్లేకుండా కొట్టుకుపోతున్నాయి. చాలా చోట్ల నూతన వంతెనలు నిర్మించకపోవడం..కొన్ని చోట్ల నిర్మిస్తున్నా ఏండ్లుగా సాగుతున్న నిర్మాణాలు సాగడం కారణంగా ఆయా చోట్ల తాత్కాలిక వంతెనలు ఏర్పాటుచేశారు. కానీ వరద భీభత్సానికి కొట్టుకుపోతుండటంతో అటువైపు వెళ్లాల్సిన అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. అత్యవసర సేవలు కూడా వినియోగించుకోలేని పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వాలు మారుతున్నా..పాలకులు మారుతున్నా ఉమ్మడి జిల్లాలో ఈ దీనస్థితి మాత్రం మారడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఖానాపూర్‌లోని రెంకోని వాగుపై కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వర్షాకాలం వచ్చిందంటే ఉమ్మడి జిల్లా వాసులకు దారి కష్టాలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. వర్షం కొన్ని రోజులే జోరుగా కురుస్తున్నా అది మిగిలిస్తున్న నష్టం మాత్రం చాలా రోజుల వరకు ఉంటుంది. పలు చోట్ల లోలెవల్ వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. రోజుల తరబడి ఇదే సమస్య ఉండటంతో కాలినడక వాగులు దాటడం లేదంటే ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చాలాదూరం ప్రయాణించి గమ్యాన్ని చేరుకుంటున్నారు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రతి ఏటా అనేక చోట్ల లోలెవల్ వంతెనలు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అవి కొట్టుకుపోయే వరకు వేచిచూస్తున్నారు. మొత్తం వరదపాలైన తర్వాత రూ.లక్షలు ఖర్చు చేసి తాత్కాలికంగా నిర్మాణం చేపడుతున్నారు. కానీ మళ్లీ వర్షం వస్తే అవి కూడా నామరూపాలు లేకుండా పోవడంతో జనానికి ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. కనీసం ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం దృష్టిసారించి ఎక్కడెక్కడ ప్రమాదకర వంతెనలు..లోలెవల్ వంతెనలు ఉన్నాయో గుర్తించడంతో పాటు కొత్తగా చేపట్టాల్సిన వాటిని పరిగణనలోకి తీసుకొని నిర్మాణాలు చేపడితే రానున్న రోజుల్లో ఈ సమస్య తప్పే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇప్పటికే ఉత్పన్నమైన సమస్యలివి..!

- ఆదిలాబాద్ జిల్లా బేల మండలం ఉమ్రి-సాంగిడి మధ్య వాగుపై నిర్మించిన తాత్కాలిక రోడ్డు వర్షం దాటికి కొట్టుకుపోయింది. దీంతో సాంగిడి, బెదోడా.మణియార్‌పూర్,గూడ గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇతర గ్రామాల నుంచి సుమారు 50కి.మిలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.



బేల : ఉమ్రి-సాంగిడి మధ్య కొట్టుకుపోయిన లోలేవల్ వంతెన



దహెగాం : అయినం గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

- కాగజ్‌నగర్ మండలంలో అందవెల్లి బ్రిడ్జి వద్ద నిర్మించిన అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో దహెగాం, కాగజ్‌నగర్, భీమిని మండలాల్లోని సుమారు 60గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వీరు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే పెంచికల్‌పేట్ నుంచి సుమారు 80కి.మి చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. మూడేండ్లుగా ఆయా గ్రామాల ప్రజలు తిప్పలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.
- ఖానాపూర్ మండలం రింకోని వాగుపై నిర్మించిన రెండు తాత్కాలిక లోలెవల్ వంతెనలు వర్షం దాటికి కొట్టుకుపోయాయి. దీంతో దిలావర్‌పూర్ వైపు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. నూతనంగా వంతెన నిర్మాణం చేపడుతున్నా ఆలస్యం కావడం మూలంగా వివిధ గ్రామాల ప్రజలు తిప్పలు పడుతున్నారు.
- ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో తర్నం వాగుపై నిర్మించిన బ్రిడ్జి మూడేండ్ల క్రితం కుంగిపోయింది. దీంతో ఆదిలాబాద్ నుంచి జైనథ్, బేల మండలాలతో పాటు మహారాష్ట్ర ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ వాగుపై తాత్కాలిక వంతెన నిర్మించినా ఒక్క వరదకే పూర్తిగా కొట్టుకుపోయింది. నిరాల నుంచి నూతనంగా నిర్మిస్తున్న రహదారి పూర్తికాకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఇలా అనేక చోట్ల వాగులపై వంతెనలు కొట్టుకుపోవడం.. రహదారులు కోతకు గురికావడంతో ప్రయాణాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రతి వర్షాకాలంలో ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం ఇలాంటి సమస్యలపై దృష్టిసారించి నూతన నిర్మాణాలు చేపడితే ప్రయాణ కష్టాలు తప్పేందుకు ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



జైనథ్ : తరోడ వాగుప్రవాహానికి కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను పట్టణంలోని ప్రజాసేవ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని ఖర్గేకు శుభాకాంక్షలు తెలిపారు. ఓ దళిత బిడ్డకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ అన్నారు. మతోన్మాద రాజకీయాలు చేసే బీజేపీ పార్టీ రాష్ట్రపతిని అయోధ్య రామ మందిరంలో శ్రీరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ఆహ్వానించలేదన్నారు. కానీ కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : అఖిల భారతీయ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మావలలో జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని ఖర్గే జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఖర్గే కర్నాటక రాష్ట్ర మంత్రిగా, శాసనసభ పక్ష నేతగా, విపక్ష నేతగా వివిధ హోదాల్లో పనిచేసిన గొప్ప అనుభవం కలిగిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, రాజన్న, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, సురేష్, ప్రవీణ్, గౌతమ్, వెంకటేష్, దినేష్, అఖిల్, అనిల్, హరీష్, శ్రీకర్ పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్య చర్చకు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలంటూ 2023లో వరంగల్‌లో ధర్నా చేస్తున్న సందర్భంలో అక్కడికి వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం రాగానే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వ ఏర్పడి ఎనిమిది నెలల అయిన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేక కనీస వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగా పని చేస్తున్నప్పటికీ తమకు గుర్తింపు లభించకపోవడం బాధాకరమన్నారు. తమ సమస్యను రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నగేష్, తిరుపతి, రాము, సుభాష్, సంతోష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీలో చర్చిస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు తనకు తెలుసని, వాటి పరిష్కరం కోసం ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డితో చర్చించడంతో పాటు అసెంబ్లీలో ప్రస్తావిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ ప్రకాష్, నాయకులు కె.ప్రశాంత్ రెడ్డి, దేవదర్శన్, శ్రీకాంత్, చందు, మమత, హిమబిందు, సోమన్న, నరేష్, దశరథ్, రమేష్, రాజన్న, నరేష్ పాల్గొన్నారు.



నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నేరడిగొండ

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటికి రావద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశాలుంటాయని, ఎలాంటి అత్యవసరం ఉన్నా వెంటనే అధికారులను సంప్రదించాలని కోరారు. అలాగే పొలాలకు వెళ్లే వారు తడిసిన విద్యుత్ స్తంభాలను తాకావద్దని, చెట్ల కింద ఉండొద్దని సూచించారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు నామినేషన్ల ప్రక్రియ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలకు ఆచరణాత్మక రూపం ఇచ్చే నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం నిర్వహించే ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్ ప్రక్రియకు విద్యార్థులు నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు నామినేషన్లు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు డీఈఓ ప్రణీత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల పరిధిలోని ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ విద్యార్థులను నమోదు చేయించాలని ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారులు, మండల నోడల్ ఆఫీసర్స్, ప్రయివేట్ పాఠశాలల ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్స్ ప్రత్యేక చొరవ తీసుకొని నామినేషన్లను నమోదు చేయాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలని ఒక ఐడియా బాక్సులు కూడా ఏర్పాటు చేయాలన్నారు. తప్పనిసరిగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు విద్యార్థులు నామినేషన్లు తప్పకుండా సమర్పించాలని, విద్యార్థుల వినూత్న ఆలోచనలను ఇన్‌స్పైర్ మనకు మొబైల్ యాప్ ద్వారా లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్.అవార్డ్స్-డీఎస్‌టీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంబంధిత పాఠశాలలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన ఆలోచనలకు రూ.10 వేలు విద్యార్థుల వ్యక్తిగత ఖాతాలో జమ చేయబడుతుందని, నామినేషన్ ప్రక్రియ గడువులోగా పూర్తిచేయలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రఘురమణ 9440060288, సెక్టోరల్ అధికారి శ్రీకాంత్ గౌడ్ 9440125312ను సంప్రదించాలని సూచించారు.

వర్షాల నేపథ్యంలో డయల్ 100కు ఫోన్ చేయాలి

- ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారీ వర్షాల సంధర్బంగా ప్రజలు అత్యవసర సమయంలో 100కు డయల్ చేసి పోలీసులను సంప్రదించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పొంగుతున్న ప్రతి వాగు, బ్రిడ్జి, కల్వర్టుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాణహిత నది ఉప్పొంగుతున్న కారణంగా నది వద్దకు ఎవరూ రాకుండా చూడాలన్నారు. వర్షాలు, వరదల నేపథ్యంలో పోలీసులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాలలో పంట పొలాల దగ్గర రైతులు జాగ్రతగా ఉండాలని సూచించారు. జిల్లాలోని పలు గ్రామాలకు వెళ్లాలంటే వాగులు వంతెనలు దాటాల్సి ఉంటుందని ప్రజలు వరద ఉధృతిని గమనించి దాటలన్నారు. వీలైతే వాగుకు ఇరువైపులా రహదారిపై కంచె వేసి తోటి ప్రయాణికులను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలు ఎటువంటి ఆపద వచ్చిన పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు వరకు రూ. రెండు లక్షలు మాఫీ చేస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల వ్యవధిలో రైతులకు రూ. లక్ష రుణమాఫీ చేసిందని, ఆగస్టు చివరి వరకు రూ. రెండు లక్షల రుణమాఫీ కూడా చేస్తుందని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి తెలిపారు. ఆదివారం ప్రజాసేవభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రైతులను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న ఆరోపణాల్లో వాస్తవం లేదన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతు రుణమాఫీ ఎందుకు కాలేదని ప్రశ్నించారు. రైతు బంధును రియల్ ఎస్టేట్, ఖాళీ భూములకు ఇచ్చారన్నారు. అదే కాంగ్రెస్ అసలైన రైతులకు అందించాలనే లక్ష్యంతో అభిప్రాయ సేకరణ చేస్తుందని తెలిపారు. దీన్ని తప్పుబట్టుతూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు కలల శ్రీనివాస్, ఖయ్యుం, లోకప్రవీణ్ రెడ్డి, వెంకన్న, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఘాట్ రోడ్ లోయలో పడ్డ కారు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఆదిలాబాద్-నిర్మల్ 7వ నెంబర్ జాతీయ పాత రహదారి మహబూబా ఘాట్‌పై ఆదివారం ఉదయం హైదారాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళుతున్న కారు అదుపుతప్పి లోయలో పడిపోయింది. 100 డైల్ ద్వారా నిర్మల్ కంట్రోల్ రూమ్ కి సమాచారం రావడంతో, అప్రమత్తమైన నిర్మల్ డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ గోపినాథ్, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ ఇద్దరూ సంఘటన స్థలానికి వెళ్లి



లోయలో పడిన కారులో ఉన్నటువంటి ముగ్గురిని కాపాడారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన వారిగా గుర్తించి, క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్స్ గోపినాథ్, శ్రీకాంత్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై

నవతెలంగాణ-లోకేశ్వరం

తెలంగాణ రాష్ట్ర డీజీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌ను లోకేశ్వరం ఎస్సై సక్రియనాయక్ ఆదివారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. గతంలో నిర్మల్ ఏఎస్పీగా జితేందర్ పనిచేసిన సమయంలో సక్రియా నాయక్ కానిస్టేబుల్‌గా ఏఎస్పీకి గన్‌మెన్‌గా పని చేశారు. జిల్లా ఎస్పీగా పనిచేసి రాష్ట్ర డీజీపీగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌ను నిర్మల్ జిల్లా ప్రజలు అభినందించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన సక్రియా నాయక్‌ను డీజీపీ అభినందించారు.



రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

తెలంగాణ రాష్ట్రంలో రైతును రాజుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా కడెం ప్రాజెక్టు ఆయకట్టు పొలాలకు ఎమ్మెల్యే సాగు నీటిని విడుదల చేశారు. ముందుగా కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కడెం ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం రూ.9 కోట్లకు పైగా నిధులను మంజూరు చేసి పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కడెం ప్రాజెక్టు డేంజర్ జోన్ లోకి వెళ్లిందని, కనీసం గ్రీజ్ పెట్టడానికి నిధులు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు కడెం ప్రాజెక్ట్ ఎక్కడ ఉందో తెలియక పోవడం విడ్డూరమని పేర్కొన్నారు. కడెం ప్రాజెక్ట్ నీటి ద్వారా కొన్ని వేల ఎకరాలకు సాగు నీరు అందబోతుందని, రైతులు దిగులు చెందకుండా రెండు పంటలను సాగు చేయొచ్చని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని, ఇటీవలే రైతుల ఖాతాల్లో రూ.1లక్షలోపు గల రుణాన్ని మాఫీ చేశామని తెలిపారు. విడతల వారీగా రుణమాఫీ చేస్తామన్నారు. రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని మాసాయిపేట్ గ్రామానికి చెందిన నాగిల్ల చిరంజీవి కూతురు నికిత ఇటీవల వేడి నూనెలో పడి తీవ్రగాయాల పాలైంది. విషయం తెలుసుకుని ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను కలిసి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేసి, పాపకు మెరుగైన వైద్య చికిత్స కోసం రిమ్స్ డాక్టర్స్‌తో మాట్లాడారు. అనంతరం మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొలిశెట్టి సత్తన్న కాలు విరిగిన విషయం తెలుసుకుని వారి ఇంటి వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన సిరివేని సత్తన్న అనారోగ్యానికి గురైన విషాన్ని తెలుసుకుని వారి ఇంటి వద్దకు వెళ్లి వారి ఆరోగ్య విషయాలను గురించి తెలుసుకుని వారి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది, కడెం మాజీ ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్, యువజన కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్ల వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ తక్కల సత్యనారాయణ, పట్టణాధ్యక్షులు వాజిద్‌ఖాన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకాల శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, ఇస్రు పటేల్, బబ్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్మరణ సభ వాల్ పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పాత ఉట్నూర్‌లో ఈ నెల 26న జరిగే భారత విప్లవోద్యమ రథసారథులు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ మాట్లాడారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి ప్రజల హక్కుల కోసం భూస్వాముల ఆగడాలను ఎదిరించడానికి వారి జీవితాలను త్యాగం చేశారన్నారు. ఈ సంస్మరణ సభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం నాయకులు చవాన్ సురేష్, ప్రజాతంత్ర విద్యార్థి సంఘం, డీఎస్ఓ జిల్లా నాయకులు చవాన్ సచిన్, టేకుల వెంకటేష్, రాథోడ్ మహేష్, రాథోడ్ రాహుల్, జాదవ్ కిరణ్, చాకటి మాణిక్‌రావు, సాయి పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏఓ ఏటూరు నాగారానికి బదిలీ



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయములో ఏఓగా విధులు నిర్వహించిన సున్నం రాంబాబు సాదారణ బదిలీల్లో భాగంగా ఏటూరు నాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఏఓగా బదిలీ అయ్యారు. కాగా ఆదివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా హజరై మాట్లాడారు. ఐటీడీఏ కార్యాలయ ఏఓగా సున్న రాంబాబు వందశాతం న్యాయం చేశారని అన్నారు. మారు మూల గిరిజన గ్రామాల ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీడీ డా.దిలీప్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ భీంరావ్, అదనపు వైద్యాధికారి మెస్రం మనోహర్, ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి సందీప్ కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ మెస్రం మనోహర్, జెడీఎం జాబ్స్ నాగభూషణం ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల కోసం పని చేస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బడుగు బలహీన వర్గాల కోసం ఆజాద్ సమాజ్ పార్టీ పని చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించారు. అనంతరం ఆజాద్ సమాజ్ పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు షకీల్ మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపారు. ప్రభుత్వాల తరఫున వారికి రావాల్సిన సంక్షేమ పథకాల కోసం కృషి చేస్తామన్నారు. ఆదివారం నుంచి నెల రోజుల పాటు పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద పెత్తున పార్టీ సభ్యత్వం తీసుకొని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆజాద్ సమాజ్ పార్టీ కోశాధికారి రహమత్ అలీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుమ్ర గులాబ్ రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఖంపెల్లి గోపి, జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ ఆరీఫ్ పాల్గొన్నారు.

ఐదేండ్ల సర్వీసును ఎన్నటికీ మర్చిపోలేను



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో ఐదేండ్ల పాటు నిర్వహించిన సర్వీసును ఎన్నటికి మర్చిపోలేనని బదిలీపై వెళ్తున్న జిల్లా అగ్రిమాపక శాఖ అధికారి కేశవులు అన్నారు. ఆదివారం ఫైర్ స్టేషన్ ఆవరణలో బదిలీపై వెళ్తున్న డీఎఫ్ఓతో పాటు ఏడీఎఫ్ఓ జనార్ధన్‌రెడ్డి, సిబ్బంది వారికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సన్మానించారు. ఫైర్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్ఓ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ 2018 డీఎఫ్ఓగా ఇక్కడి బదిలీపై వచ్చానని తెలిపారు. ఇక్కడి ఫైర్ స్టేషన్‌లో కంపౌండ్ వాల్ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డామన్నారు. తరువాత ప్రహరీతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించుకున్నామని తెలిపారు. తన 30 ఏండ్ల సర్వీసులో ఆదిలాబాద్ లాంటి వాతావరణం, మనుషులు, ఆప్యాత ఎన్నటికి మరిచిపోలేనని కన్నీంటి పర్యాంతమయ్యారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శివాజీ, కాంతరావు, ఎం.రవి, సిబ్బంది పాల్గొన్నారు.

తెగిన రెంకొని వాగు అప్రోచ్ రోడ్డును పునరుద్ధరించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

వరదలకు తెగిన రెంకొని వాగు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డును పునరుద్ధరించి సత్వరమే రాకపోకలను ప్రారంభించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లోని రెంకొని వాగు బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్డు తెగిపోయిన విషయం తెలుసుకొని ఆయన సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీగా కురిసిన వర్షాలకు ఖానాపూర్ మండలంలోని, దిలావర్‌పూర్ నుంచి దాదాపు 24 గ్రామాలకు వెళ్లే రహదారి, తర్లపాడ్ మంచిర్యాల రోడ్డు వద్ద రెంకొన వాగు బిడ్జి పనులు జరుగుతున్న నేపథ్యంలో రాకపోకలకు ప్రక్కన వేసిన అప్రోచ్ రోడ్డు భారీ వర్షాలకు తెగిపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. తాత్కాలిక రోడ్డు వేయాలని అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ని కోరారు. వెంటనే ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అధిక వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుభద్రతపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలం ధనోర(బి) బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో రోడ్డుభద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతకు పాటించాల్సిన సూచనలు తప్పకుండా పాటించాలని వివరించారు. వర్షాకాలంలో వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రయివేటు వాహనాలను ఆశ్రయించకుండా, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని అన్నారు. గమ్యం యాప్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్టీఐ ఎస్కె యూసఫ్, విలేజ్ బస్ ఆఫీసర్ సి.సతీష్ పాల్గొన్నారు.

నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీలో విలీనం చేయాలి

- ఏజెన్సీ డీఎస్సీ వేయాలి
- 5వ షెడ్యూల్ ప్రాంతాన్ని కాపాడాలి
- రాష్ట్ర గవర్నర్‌కు టీఏజీఎస్ సంఘం వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాన్ ఏజెన్సీలో ఉన్న వంద శాతం జనాభా కలిగి ఉన్న గ్రామాలను ఏజెన్సీలో విలీనం చేయాలని, 5వ షెడ్యూల్ ప్రాంతాన్ని కాపాడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) నాయకులు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో గవర్నర్ సీపీ రాధాక్రిష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన సమస్యలపై కాసేపు చర్చించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 5వ షెడ్యూల్‌లో 1/70, పేసా ఆదివాసీ చట్టాలను అమలయ్యే విధంగా చూడాలని కోరారు. రాష్ట్రంలో గిరిజన సలహా మండలి (టీఏసీ)ఏర్పాటు చేయాలనీ అన్నారు. ఏజెన్సీలో నిరుద్యోగ యువతకు ఉపయోగపడే జీఓ నెం.3ను పునరుద్దరణ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న అన్ని డిపార్టుమెంట్‌ల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలనీ, గిరిజన విద్యారంగం అభివృద్ధికి ఏజెన్సీ



డీఎస్సీ వేసే విధంగా చూడాలని కోరారు. ఈ సమస్యలపై గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలో ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటిస్తానని అన్ని సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని ప్రతినిధి బృందంకు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఉపాధ్యక్షులు తొడసం భీంరావు, బి.రవికుమార్, సహాయ కార్యదర్శి ఆత్రం తనుష్ పాల్గొన్నారు.

నేడు భీమన్న దేవుని పండుగ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భీమన్న దేవుని పండుగను సోమవారం నిర్వహించనున్నట్లు తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని గాంధీపార్కులోని భీమన్న ఆలయంలో ఏర్పాట్లను సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా సలేంద్ర శివయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో గల భీమన్న ఆలయంలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పార్కులో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గ సాగుతున్నాయని తెలిపారు. పండుగ వేడుకలకు ముదిరాజ్ బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రెంకొని వాగు అప్రోచ్ రోడ్డు పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఖానాపూర్

వరదకు కొట్టుకుపోయిన దిలావర్‌పూర్ రెంకొని వాగు అప్రోచ్ రోడ్డును ఆదివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణ శివారులో ఉన్నటువంటి రెంకొని వాగుల వద్ద నూతనంగా జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేస్తామని, ప్రజలు వాహనదారులు సహకరించాలని తాత్కాలికంగా వాహనాలు నడవడానికి వేసినటువంటి మట్టి రోడ్డు వరదకు కొట్టుకుపోయిందని కొట్టుకుపోయిన రోడ్డును వేయాలని అధికారులకు సూచించారు. నూతనంగా నిర్మిస్తున్నటువంటి వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులతో ఫోన్లో మాట్లాడారు. వంతెన పనులు పూర్తయితే ఏ సమస్య ఉండదని అన్నారు. వారి వెంట ప్రజా పతినిధులు, నాయకులు ఉన్నారు.

ఘనంగా గురు పౌర్ణిమ వేడుకలు



నవతెలంగాణ-నార్నూర్

గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనితో పాటు లంబాడి తండాల్లో బంజార, లంబాడీల ధర్మగురు రామారావ్ మహారాజ్ జన్మదిన సందర్భంగా భోగ్ భండార్ పూజలు చేశారు. అదేవిధంగా మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో అషాడ పౌర్ణమి వర్షవాస్ దినోత్సవాన్ని పురష్కరించుకుని బుద్ధవిహార్‌లో బుద్ధ వందన పంచశీల్ త్రిశరణ్ పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మెన్ సురేష్ ఆడే, గ్రామ పెద్దలు చౌహాన్ యశ్వంత్‌రావ్, మహేందర్, బాలాజీ, బిక్కు, అనిల్ నాయక్, ఫకీరా నాయక్, రాథోడ్ దిలీప్, సురేష్, సుభాష్, బౌద్ధ ఉపాసిక్ సంఘ్ ఉపాసిక ఝాడే సుజాత, సొంటకే నిలాబాయి, కాంబ్లె విమల, బౌద్ధ ఉపాసకులు సొంటకే బాపురావ్, జాబాడే గణపత్, మానే విశ్వకళ్యాణ్ ఉన్నారు.

ఉట్నూర్ : తండాల్లో గురు పౌర్ణమి వేడుకలను బంజారా ప్రజలు, సేవాలాల్ ఆలయంలో ఆదివారం భోగ్ భండర్‌లో పూజా, కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భారత్ చవాన్, టీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని సేవాదాస్ నగర్, పాత ఉట్నూర్, నాయక్ నగర్, హస్నాపూర్, యెందా, పులిమడుగుతో పాటు తదితర గ్రామాల్లో సంత్ డాక్టర్ రామారావు మహారాజ్ జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లంబాడా, బంజార ప్రజలను శ్రీశ్రీశ్రీ సంత్ డాక్టర్ రామారావు మహారాజ్ ఏకతాటిపై తెచ్చారని అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని జూలై 21 గురు పౌర్ణమి నాడే ఒక పండుగ లాగా జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సలహాదారుడు పవార్ దేవిదాస్, కవి బంకట్ లాల్, గిరిజన లంబాడీల ఐక్యవేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ వసంతరావు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి బానోత్ రవీందర్, బంజారా యువ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ మహేందర్, గణేష్, గోవింద్, ధనరాజ్, విలాస్ పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు



నవతెలంగాణ-ఉట్నూర్

రెండు రోజుల నుంచి మోస్తరుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని బొపర్‌కుంటకు చెందిన టేకం లక్ష్మణ్(26) వాగు దాటుతుండగా వాగులో గల్లంతయ్యాడు. తండ్రి తుకారాం సమాచారం మేరకు ఆదివారం డీడీఆర్ఎఫ్ పోలీసు బలగాలతో వాగులో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపు చర్యల్లో యువకుడి ఆచూకీ లభ్యం కాలేదని తెలిపారు. ఈ గాలింపు చర్యల్లో హెచ్‌సీ మల్లేష్, హెచ్‌సీ నాగన్న, 100 డయల్ పోలీసు జైరాం, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు ఉన్నారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి



నవతెలంగాణ-కడెం

మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ సుమన్ కుమార్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడే శక్తి మొక్కలకే ఉందన్నారు. భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మల్లిఖార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నేరడిగొండ

కాంగ్రెస్ జాతీయాధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను ఆదివారం మండల కేంద్రంలోని ఏలేటి అశ్విన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు జాదవ్ వసంత్‌రావు, సీనియర్ నాయకులు కుర్మే మహేందర్, నల్ల శ్రీకాంత్‌రెడ్డి, రామ్‌లక్ష్మణ్‌గౌడ్, బరే నాగేందర్, చందు, కిరణ్, యువజన నాయకుడు ఏర్ల శ్రీకాంత్, అన్‌రెడ్డి సాగర్ రెడ్డి,రాజు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | జులై 22, 2024 | www.navatelangana.com

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన కొట్రంగి సంతోష్ (35) దగ్గరలోని బొక్కివాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం ఇంట్లో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి బయటకు వెళ్లిన సంతోష్ దగ్గరలో ఉన్న బొక్కివాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రత్యక్షంగా చూసిన బామినె గణపతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు మృతదేహం కోసం గాలించగా ఆదివారం మధ్యాహ్నం లభించింది. ఈ మేరకు భార్య భూదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా వర్షవాస్ ప్రారంభం

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలో ఆదివారం నూతనంగా నిర్మించిన ప్రవచన్ భవనంలో 32వ వర్షవాస్‌ను సీనియర్ ఉపాసకులు భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షులు జయరాం ఉప్రె, జిల్లా అధ్యక్షుడు అశోక్ మౌల్కార్ ప్రారంభించారు. మూడు నెలల పాటు వర్షవాస్ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. బుద్ధ, ధమ్మ గ్రంథ పఠనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు దుర్గం సునీల్, కార్యదర్శులు ఉప్రె రోషన్, కొట్రాగడె విలాస్, బౌద్ధ సమాజ్ అధ్యక్షుడు విజయ్ ఉప్రె, శ్యాంరావు, వర్షవాత్ అధ్యక్షుడు ధ్గుం ప్రశాంత్, ఉపాధ్యక్షులు దీక్షిత్, అంబేద్కర్ సంఘం నాయకులు ప్రతాప్, డోంగ్రె రమేష్, విద్యాసాగర్, దుర్గె చింటు, తుఫాన్ ఉప్రె, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ప్రాణహిత

- జలదిగ్బంధంలో రెండు గ్రామాలు



నవతెలంగాణ-బెజ్జూర్

రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో ఆదివారం ప్రాణహిత బ్యాక్ వాటర్ రావడంతో తలాయి, తిక్కపల్లి గ్రామాలు జలదిబ్బందానికి గురయ్యాయి. పాపన్నపేట, తలాయి ప్రధాన రహదారి మునిగిపోయింది. దీంతో రెండు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాపన్నపేట గ్రామ సమీపంలోని వంతెన పూర్తిగా నీట మునిగింది. మరో రెండు రోజులపాటు వర్షాలు ఇలాగే కొనసాగితే ప్రాణహిత బ్యాక్ వాటర్ పాపన్నపేట గ్రామ సమీపానికి చేరే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు నీట మునిగి తాము నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

రామారావు మహరాజ్ అడుగుజాడల్లో నడవాలి



నవతెలంగాణ-కెరమెరి

తపస్వి సంత్ శ్రీ రామారావు మహరాజ్ అడుగుజాడల్లో నడవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్ లాల్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంత్ రామారావు మహరాజ్ 89 జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బంజారా సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ 50 ఏండ్లలో అనేక మంది లాంబాడ ప్రజలను వ్యసనాల నుండి విముక్తి చేసినట్లు తెలిపారు. గ్రామగ్రామాన తిరుగుతూ సమాజం పట్ల అవగాహన కల్పించారన్నారు. బంజారా సమాజాన్ని చైతన్యం చేశారని పేర్కొన్నారు. బంజారా ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను దూరం చేశారని పేర్కొన్నారు. రామరావు మహరాజ్ ఆశయ సాధనకు లంబాడా ప్రజలు పాటు పడాలని, బంజారా సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు రాథోడ్ శంకర్ నాయక్, రాథోడ్ ఉత్తమ్ నాయక్, బానోత్ వెంకట్ నాయక్, ధారవాత్ లాలూ, జాలోత్ తిరుపతి, జాలోత్ దేవాజీ, సుదర్శన్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బందిని రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో సి జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సంఘం ఎన్నికకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. 510 జీఓ అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సేవలో ముఖ్యపాత్ర పోషిస్తున్న సిబ్బందికి గత ప్రభుత్వం మాదిరిగానే ఇస్తూ వేతనాలు పెంచే విషయాన్ని దాటవేస్తున్నారన్నారు. కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తామనడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న 17వేల మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లావుడ్య సురేష్ నాయక్, రాష్ట్ర నాయకులు కొంద్ర లత, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షుడు మధుకర్, నాయకులు చిరంజీవి, వినోద్, స్రవంతి, ముస్తక్, శ్రీనివాస్, గోపి కృష్ణ, సాయిలత, మ్రిదుల్ పాల్గొన్నారు.

జిల్లా కమిటీ అధ్యక్షుడుగా ఉపేందర్

నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా బోగే ఉపేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గ్యార వినోద్, ఎండి షకీల్, ఉపాధ్యక్షుడుగా చిరంజీవి, గోపి కృష్ణ, చంద్రకళ, జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిపల్లి మధుకర్, సహాయ కార్యదర్శి ముస్తాక్, బి.శ్రీదేవి, సాయిలత, కోశాధికారి సంగీతలను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకటించారు.

కాపు సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియామకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా కాగజ్‌నగర్‌కు చెందిన ఎమ్మాజి సంతోష్‌కుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు సంతోష్ కుమార్ ఆదివారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజారాం పటేల్ నుండి నియామకపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో రాష్ట్ర బాధ్యతలు అప్పచెప్పినందుకు రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్యతో పాటు పలువురికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చెన్న సోమశేఖర్, జిల్లా కార్యదర్శి పిర్సింగుల కోటేష్ పాల్గొన్నారు.

ధరాఘాతం

- సెంచరీకి చేరువలో కూరగాయల ధరలు
- కొనలేని..తినలేని స్థితిలోజనం



నవతెలంగాణ-కెరమెరి

కూరగాయలు కొనాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. పచ్చి మిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతోంది. టమోటా, కూరగాయల సాగు తగ్గిందని ధరలు పెరిగాయి. అంటూ చెప్పి సామాన్యులను దోపిడీ చేస్తున్నారు. గతంలో కిలో టమోటా ధర రూ.40 ఉండగా ఏకంగా రూ.80 వరకు చేరింది. నిత్యం వంటకాల్లో టమోటా అవసరం తప్పదు కాబట్టి ఎంత ధర పెట్టి అయినా కొనుగోలు చేస్తున్నారు. వంకాయలు గతంలో కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం.80 ఉంది. నేడు ,. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు కూడా గతంలో రూ.15 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.50కు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వీధి దుకాణాల్లో కిలో రూ.50 చొప్పున అమ్ముతున్నారు. బీరకాయలు ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో లేకున్నాయి. ఇక పచ్చిమిరపకాయల మాట ఎత్తుకుంటే కిలో రూ.80 చొప్పున అమ్మకం సాగిస్తున్నారు. ఇదేమిటి అంటే ఈసారి పంట తక్కువగా ఉందని, గిరాకీ బాగా పెరిగిందని దుకాణదారులు చెప్పడం గమనార్హం. ఇక ఆకుకూరల ఆరోగ్యానికి ఎంతో మంచివని వైద్యులు చెప్పడంతో వాటి ధరలు సైతం ప్రస్తుతం మార్కెట్‌లో అమాంతంగా పెరిగాయి. ఏ ఆకు కూర కట్ట తీసుకున్నా రూ.10 ఉంది. ముఖ్యంగా మెంతి ఆకు, పాలకుకూర వంటి వాటిని సైతం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇక ఆదివారం వస్తే మాంసంలోకి కచ్చితంగా వాడే పుదీనా, కొత్తిమీర, అల్లం వంటివి కూడా ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనాలంటే ఆందోళనకు గురవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో విఫలమైయ్యారని ప్రజలు భావిస్తున్నారు. మార్కెట్‌లోకి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటే భయమేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ రేట్లను విపరీతంగా పెంచడంతో రవాణ ద్వారా నిత్యావసర, కూరగాయలు రేట్లు అధికమయ్యాయి. దీని వల్ల రైతుల కంటే దళారులు ఎక్కువ ఫలితం పొందుతున్నారు. రైతులు, వినియోగదారులు నష్టపోతున్నారు.

కూరగాయల ధరలు ఇలా

చిక్కుడు	80
టమాటా	80
వంకాయ	80
కాకర	80
బెండకాయ	20
అలసంద	40
తోటకూర	80
ఎల్లి పాయ	200
ఉల్లిపాయ	40
అల్లం	120
సొరకాయ	40
బీరకాయ	80
మునగ.	80

ధరలను నియంత్రించాలి

గోగర్ల సరిత, గృహిణీ, కెరమెరి



కూలీ, నాలి చేసుకొని బ్రతుకుతున్నాం. రోజూ కూలీ పని చేస్తే తప్ప పూట గడవని దుస్థితి. కూరగాయల ధరలేమో మండి పోతున్నాయి. కూరగాయలు కొని తినలేని పరిస్థితి. కొన్ని నెలలుగా ధరలు పెరుగుతున్నాయి. దీంతో పేద ప్రజలకు కష్టంగా మారింది. ప్రతి రోజు చేసే వంటకాల్లో టమాటా అవసరం. కానీ పెరిగిన ధరలతో వారానికి ఒక్క రోజు కూరగాయలు తినాల్సి వస్తుంది. ప్రభుత్వం పెరిగిన ధరలను నియంత్రించాలి.

ధరలు సామాన్యలకు అందుబాటులో ఉండాలి

లెన్గురే బాలాజీ, మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి



రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి. సామాన్య ప్రజలకు ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు పనులు దొరక్క చేతుల్లో చిల్లి గవ్వ లేక ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తరుణంలో కూరగాయల ధరలు పేద ప్రజలను ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి ధరలు తగించేందుకు కృషి చేయాలి. నిత్యావసర ధరలతో పాటు కూరగాయల ధరలు తగిస్తే పేదలకు భారం తగ్గుతుంది.

అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా అనంతరం వినతి



ఆసిఫాబాద్ : ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. కాంగ్రెస్ గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ. పదివేల వేతనం చెల్లించాలన్నారు. ప్రభుత్వం సరైన సమయంలో బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారానికి మూడు గుడ్లు పెట్టాలని నిబంధన విధించినప్పటికీ దానికి సరిపడా బిల్లులు మంజూరు చేయడం లేదన్నారు. దీంతో నిబంధనలు పాటించలేక డబ్బులు పెట్టలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం ఇచ్చిన హామీని అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పగిడి మాయ, విజయ, రంభ, బాగుభాయ్, గౌరుభాయ్, రాజేశ్వరి, నిర్మల, శాంతాబాయి, లక్ష్మి చిన్నుభాయి, తార, గుండుబాయి, శ్యామల, ఊర్మిళ మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి పరిష్కరించే విధంగా చూడాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిచాల కృష్ణమాచారి కోరారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఇంటి ముందు ధర్నా చేపట్టారు. వారిని లోనికి ఆహ్వానించిన ఎమ్మెల్యే హరీష్‌బాబు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రూ. 10 వేల వేతనం అందించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీకి అందించాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. అనంతరం కార్మికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో కార్మికుల సమస్యలపై మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కొట్రంగి శారద, కోశాధికారి రూప, మండల నాయకులు బాయక్క, సువర్ణ, సునీతా, పద్మ వనిత, మల్లిక పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

కనువిందు చేస్తున్న గుండాల జలపాతం



నవతెలంగాణ-తిర్యాణి

మండలంలోని గుండాల గ్రామంలో గల గుండాల జలపాతం వర్షాలతో జలకళను సంతరించుకుంది. జలపాతం దాదాపు 125 అడుగుల ఎత్తులో ఉంది. జలపాతంలో కొన్ని ప్రకృతి అందాలున్నాయి. దీనినే బాహుబలి జలపాతం అని పర్యటకులు అంటున్నారు. వర్షాకాలం వస్తే చాలు వేరే జిల్లాల నుండి పర్యాటకులు జలపాతం వద్దకు అధిక సంఖ్యలో వస్తుంటారు. జలపాతం చూడడానికి పచ్చని అడవిలో అరణ్య గర్భంలో అందాల జలపాతం పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తుంది. ప్రకృతి ఒడిలో ఈ జలపాతం ఎత్తైన కొండల నడుమ దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంటుంది. ఇక్కడికి చేరుకోవాలంటే సాహసం చేయాల్సిందే. ఎత్తైన చెట్లు, పక్షుల కిలకిల రాగాలు, ప్రకృతి మైమరిపించే విధంగా దట్టమైన అటవీ ప్రాంతం, వాగులు, గుట్టలు కనువిందు చేస్తాయి. ఇక్కడికి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుండి పర్యాటకులు వస్తుంటారు. సరైనా రోడ్డు మార్గం లేకపోవడంతో దండేపల్లి మండలం నుండి గుండాల వరకు 15 కిలోమీటర్లు, తిర్యాణి మండలం రొంపల్లి నుండి గుండాల వరకు ఏడు కిలోమీటర్ల మేర ఎటూ చూసిన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పర్యాటకులకు కష్టాలు తప్పడం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుండాల గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి చేయాలన్నారు. అదే గుండాల జలపాతాన్ని ఎకో టూరిజం అభివృద్ధి చేస్తాం అంటున్నా నేటికి జరగడం లేదని గ్రామస్తులు, పర్యాటకులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

కుమురం భీమ్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్


మండలంలోని అడ కుమురం భీమ్ ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు కేటాయించాలని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం నాయకులతో కలిసి ప్రాజెక్టు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో 10 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించారని, ప్రస్తుతం అది కృంగిపోయిందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు కేటాయించలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రాజెక్టు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వెంటనే నిధులు కేటాయించి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రహ్లాద్, పెంటయ్య, ప్రసాద్ గౌడ్, గొల్ల, సురేష్ పాల్గొన్నారు.



వీడని వర్షం

- జిల్లా కేంద్రంలో పలుచోట్ల నిలిచిన నీరు
- అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ఆదివారం కూడా వర్షం పడింది. ఎగువన కురిసిన వర్షాలకు వాగులు పొంగడంతో పాటు రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గుండి వాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండగా అక్కడ గ్రామస్తులు ఎవరు దాటకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

జిల్లాలో శనివారం ఉదయం నుండి ఆదివారం ఉదయం వరకు సగటు 63.3 మిల్లీ మీటర్ల వర్షపాతం కురియగా మండలాల వారీగా కురిసిన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జైనూర్‌లో 85.4 మీమీ, సిర్పూర్ (యు)లో 75.2, లింగాపూర్‌లో 108.2, తిర్యాణిలో 55, రెబ్బెనలో 42.4, ఆసిఫాబాద్‌లో 81, కెరమెరిలో 59.8, వాంకిడిలో 72.2, కాగజ్‌నగర్‌లో 26.6, సిర్పూర్(టి)లో 34.2, కౌటాలలో 61.2, చింతలమానపెల్లిలో 74.8, బెజ్జూర్‌లో 56.4, పెంచికలపేటలో 62.4, దహెగాంలో 54.4 మీమీల వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

రెండు రోజులుగా కుమురం భీం ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురియడంతో ఎగువ నుంచి వరద నీరు అడ ప్రాజెక్టులో వచ్చి చేరుతుంది. దీంతో మధ్యాహ్నం 2 గంటలకు నాలుగు, ఐదు, ఆరు నెంబర్ గల గేట్లను 0.5 మీటర్లు పైకి ఎత్తి 3258 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. దీనితో కింద ఉన్న గుండి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

జాలువారుతున్న దుద్ధులాయి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని గుండపెల్లి అటవీ ప్రాంతంలో దుద్దులాయి జలపాతం కనువిందు చేస్తోంది. మండల కేంద్రం నుండి గుండెపల్లి బేస్ క్యాంపు వద్దకు వెళ్లి అక్కడి నుండి అడవిలో నడక మార్గాన రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే దుద్దులాయి జలపాతాన్ని చేరుకోవచ్చు.

వసతి గృహానికి నూతన భవనం నిర్మించాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సాంఘిక సంక్షేమ వసతి గృహంలో కళాశాల విద్యార్థులకు నూతన భవనం నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యాలయాల ఆవేదన యాత్రలో భాగంగా రెండో రోజు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గదులలో పాఠశాల, కళాశాల హాస్టళ్లు కొనసాగడం వలన విద్యార్థులు ఇరుకు గదులలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవనం కూడా కాలపరిమితి తీరడంతో వర్షం పడితే నీరు లోపలికి వస్తుందని తెలిపారు. సోలార్ యంత్రాలు వచ్చి సంవత్సరం అవుతున్న నేటి వరకు అవి హాస్టళ్లలో అమర్చలేదని, విద్యార్థులు చన్నీటి స్నానం చేస్తున్నారన్నారు. వెంటనే సోలార్ యంత్రాలు అమర్చి విద్యార్థులకు వేడి నీళ్లను అందుబాటులో తీసుకరావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మాస్కే నగేష్, జిల్లా నాయకులు మదాసు నగేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘణంగా గురు పౌర్ణిమ వేడుకలు



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని రామాలయం ప్రాంగణంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను దయానందగిరి స్వామి శిష్యుడు గోలి శంకర్ లింగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముడి పాదుకలను ఊరేగింపుగా తీసుకెళ్లి సదాశివ్‌పేట్ శివాలయంలో ఆలయ అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తిరిగివచ్చి గురు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాసాల సత్యనారాయణ కళ్యాణి దంపతులతో గురుపూజ మహోత్సవం నిర్వహించినంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : జిల్లాలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆలయ పూజారి మధుకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | జులై 22, 2024 | www.navatelangana.com

ఘనంగా కర్గే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మంచిర్యాల

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు ఆదివారం మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గేకు నియోజకవర్గ ప్రజలందరి తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువల మరమ్మతుకు ప్రత్యేక చొరవ చూపాలి

నవతెలంగాణ-జన్నారం



కడెం ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువకు ఆదివారం నీటిని విడుదల చేసిన సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు మండల రైతుల తరపున కాంగ్రెస్ మండల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుల రైతులతో కలిసి కడెం ప్రాజెక్టు వద్దకు వెళ్లి జన్నారం మండలంలోని ప్రధాన కాలువ, చెరువుల కుంటల మరమ్మతుల గురించి ఎమ్మెల్యే, బొజ్జు పటేల్‌కు ఎస్ఇ, ఈఈకి విన్నవించారు. కాలువలకు గండ్లు పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, సయ్యద్ ఇసాక్, దాముక కరుణాకర్, దుర్గం లక్ష్మీనారాయణ, సుధీర్ పాల్గొన్నారు.

మళ్లీ ముంపు గుప్పిట్లో మంచిర్యాల

- హామీలకే పరిమితమైన కరకట్ట నిర్మాణం
- బయాందోళనలో పలు కాలనీల ప్రజలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంచిర్యాల పట్టణం ముంపుకు గురయ్యే ప్రమాదం అందనటంలో అతిశయోక్తిలేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు బయాందోళనకు గురవుతున్నారు. రెండేండ్ల కింద కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని పలు కాలనీల్లో వరద నీరు చేరి పెద్ద ఎత్తున ఆస్తినష్టం జరిగింది. నాటి కలెక్టర్ భారతి హోళికేరి తక్షణ సహాయక చర్యలు చేపట్టి పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించారు. కట్టు బట్టలతో బయటకు వెళ్లి ఇంటిని, ఇంటిలో ఉన్న సామన్ లతో పాటు సర్వం కోల్పోయిన వారి ఆర్థనాదలు జిల్లా ప్రజల గుండెల్లో ఇంకా మెదులుతున్నాయి. మళ్లీ అలాంటి పరిస్తితులు వస్తాయేమోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అప్పటి పరిస్థితులే మళ్ళీ ఎదురైతే ఎలా అనే సందేహం పట్టణ ప్రజల్లో మొదలైంది. ఈ విషయంలో కలెక్టర్ కుమార్ దీపక్ ముందస్తు చర్యలు చేపడుతున్నారు. సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.



నవతెలంగాణ-మంచిర్యాల

2022 జులై నెలలో కురిసిన వర్షాలు జిల్లాను అతలాకుతలం చేశాయి. ఒక్క సారిగా వరద నీరు చేరడంతో మంచిర్యాల పట్టణం దాదాపు సగం వరకు నీట మునిగింది. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తుతున్న కొద్ది వరద నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుతుంది. ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో వరద నీరు అంతా మంచిర్యాల మీదగా ప్రవహిస్తున్న గోదావరిలో కలుస్తుంది. ఇటు బొక్కల గుట్ట నుంచి మంచిర్యాలను ఆనుకొని ప్రవహించే రాళ్ళ వాగు, తొల్లవాగులో ప్రవహించే వరద నీరు కూడా గోదావరిలో చేరుతుంది. గతంలో ఒకసారిగా గోదావరిలో ప్రవహించే నీరు రివర్స్ కొట్టడంతో మంచిర్యాల శివారు ప్రాంతాలు అయిన పాత మంచిర్యాల, ఆదిత్య ఎన్క్లేవ్, రాంనగర్, పద్మశాలి కాలనీ, ఎల్ఐసీ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, రెడ్డికాలనీ, సంజీవయ్య కాలనీలు పూర్తిగా జలమయం అయ్యాయి. అధికారులు ప్రజానాయకులు అక్కడికి చేరుకొని వరదల్లో చిక్కుకొని పోయిన వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఈతగాళ్లను, రెస్క్యూ టీం లను ఏర్పాటు చేశారు. పడవలు, బోట్ ద్వారా ఇండ్లలో చిక్కుకున్న ప్రజలను బయటకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేశారు. ఎటువంటి ప్రాణనష్టం జరగనప్పటికి పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగింది. ఇప్పటికీ వరద సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

హామీలకే పరిమితమైన కరకట్ట నిర్మాణం

మంచిర్యాలలో వరదలను అడ్డుకొనేందుకు కర కట్టల నిర్మాణం చేస్తామన్న ప్రజా ప్రతినిధుల హామీలు రెండేండ్లు అయిన అమలుకు నోచుకోలేదు. పట్టణంలో కర కట్టలు, నాలాల నిర్మాణం చేపడితే ఎంత వరద నీరు వచ్చినా పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ పటిష్ట పరిచేందుకు చర్యలు చేపడతామని హామీలు ఇచ్చారు. కాలనీల్లో నాళ ల నిర్మాణం చేపడుతే వరద సమయంలో మళ్ళీ అలాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండదని భావించారు. పట్టణానికి నలు మూలల కర కట్టల నిర్మాణం చేపడతామని స్థానిక నాయకులు హామీల మిద హామీలు ఇచ్చారు. కర కట్టల నిర్మాణానికి అధికార యంత్రాంగం ప్రతిపాధనలు సైతం ప్రభుత్వానికి నివేధించారు. నిధులు రాక పోవడంతో ఏ ఒక్క పని కూడా మొదలు కాలేదు. దీనితో లోతట్టు ప్రాంతల ప్రజలకు మళ్ళీ వరద కష్టాలు తప్పేలా లేదు.

కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు

రూ.230 కోట్లతో అధికారులూ కార్మెల్ స్కూల్ వద్ద ఉన్న బ్రిడ్జిని ఆనుకొని గోదవరి నది వరకు కర కట్టల నిర్మాణానికి ప్లాన్ చేసి ఎస్టిమేషన్‌ను తయారు చేసి సర్కారుకు పంపించారు. ఫండ్స్ లేకపోవడంతో ప్రభుత్వం ప్రపోజల్‌ను పక్కన పెట్టింది. కర కట్టల నిర్మాణం పూర్తయితే ఎటువంటి వరద నీరు పట్టణం లోకి చేరే అవకాశం ఉండేది కాదని పవ్వురు అంటున్నారు. ప్రభుత్వాలు మారినప్పటికి ఈ వరదల వలన వచ్చే నీటితో మంచిర్యాలలోని శివరు ప్రాంతాల ప్రజలకు కష్టాలు తప్పేలా లెవంటున్నారు. ఒక వైపు అధికారులు, ప్రజా ప్రతినిధులు మారిన మా బ్రతుకులు మారేలా లేవని ఆందోళన చెందుతున్నారు.



ఎల్లంపల్లికి చేరని వరద నీరు

- గతేడాది ఈ సమయానికి ఫుల్ స్టోరేజ్
- నేడు 7 టీఎంసీలకే పరిమితం

నవతెలంగాణ-హాజీపూర్



వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు లోకి మాత్రం వరద నీరు చేరడం లేదు. గత ఏడాది ఈ సమయానికి ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 20 టీఎంసీల నీరు వుండగా, ప్రస్తుందం కేవలం 7.5 టీఎంసీల నీటి మాత్రమే ఉంది. ఆదివారం కడెం ప్రాజెక్ట్ 3 గేట్లు తెరవడంతో సోమవారం సాయంత్రం వరకు మరో 3 టీఎంసీల నీరు ప్రాజెక్ట్‌కు చేరనుంది. కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్ లోకి 25వేల క్యూసెక్కుల నీరు వరద రూపంలో వస్తుంది, కడెం ప్రాజెక్టు నుండి 12 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతుంది. మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, హాజీపూర్ మండలాల్లో ఇప్పటి వరకు కురావాల్సిన వర్షం కురవకపోవడంతో ప్రాజెక్ట్‌లోకి నీరు చేరడం లేదు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాజెక్ట్‌లు పూర్తి స్థాయి నీటి సామర్థ్యంకు చేరుకోగా, ఎల్లంపల్లి ప్రాజెక్టు మాత్రం సగానికి కూడా నీరు చేరలేదు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సస్పెన్షన్ ఎత్తివేయాలి.

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అనీల సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కల్వల శరత్ ఒక ప్రకటనలో పేర్కొనారు. దళిత మహిళ కాబట్టి తప్పుడు ఆరోపణల పేరుతో పాఠశాల సిబ్బందితో ఎంఈఓ కుమ్మక్కై దళిత మహిళ ప్రిన్సిపాల్ అయిన అనీలను సస్పెండ్ చేయడం శోచనీయం అన్నారు. ప్రిన్సిపల్ స్థానాన్ని దక్కించుకోవడానికి కొంతమంది కుట్ర పూర్వకంగా ఆరోపణలు చేసి సస్పెండ్ చేయడానికి కారణమయ్యారని అన్నారు. తక్షణమే జిల్లా విద్యాధికారి స్పందించి దళిత మహిళ ప్రిన్సిపాల్ అయిన అనిల సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని డిమాండ్. ఎంఈఓ కాకుండా వేరే శాఖ అధికారుల ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తప్పుడు విచారణతో సస్పెండ్ చేశారని సస్పెండ్ చేయడానికి కారణమైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అన్నారు.

కోతకు గురవుతున్న రోడ్డు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గురువాపూర్, చింతగూడెం రహదారి మధ్యలో రొడ్డు కోతకు గురవుతుంది. సల్పాలవాగు ప్రాజెక్ట్ కెనాల్ గురువాపూర్, చింతగూడ రోడ్డు పక్కన ఉండగా, కెనాల్ కోతకు గురవుతూ రోడ్డు వరకు వెళ్లడంతో రోడ్డు కూడా కోతకు గురవుతుంది. మరమ్మత్తులు చేపట్టకుంటే రోడ్డు, కెనాల్ కూలే ప్రమాదం ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దుబ్బగూడెంలో కూలిన ఇల్లు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దుబ్బగూడెంకు చెందిన దుర్గమ్మ ఇల్లు పాక్షికంగా దెబ్బతిని కూలింది. దుర్గమ్మ తన కూతురు, ఇద్దరు మనుములతో కలిసి నివసిస్తుండగా శనివారం రాత్రి ఇంట్లోనే వర్షానికి ఇల్లు నాని గది కూలింది. పక్క గదిలో ఉండటంతో ప్రమాదం తప్పింది.

వంతెన మీదుగా రాకపోకలు నిలిపివేత

నవతెలంగాణ-వేమనపల్లి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని ముల్కలపేట నుంచి రాచర్ల వెళ్లె మార్గంలో రాకపోకలు నిలిపివేస్తున్నట్టు నీల్వాయి ఎస్సై తెలిపారు. కొత్తగా నిర్మించిన హైలెవెల్ వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు భారీ వర్షాలకు కుంగిపోయి ప్రమాదకరంగా మారడంతో ఆ మార్గాన్ని మూసినట్టు పోలీసులు తెలిపారు. ఇందుకు రాచర్ల వెంచపల్లి, సూపాక, జనగామ, ఆలగామ గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

భారీ వర్షాలకు ఉప్పొంగిన వాగులు



నవతెలంగాణ-జన్నారం

మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మండలంలోని చెక్కపల్లి కుంట చెరువు వద్ద 11 కేవీ విద్యుత్ లైన్ తెగిపోవడంతో నాలుగు స్తంభాలు విరిగి నేలపై పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. మండలంలోని మొర్రిగూడ, పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న జన్నారం వాగు మహ్మదాబాద్ వాగులు పొంగిపొర్లుతున్నాయి. నిరంతరం కురుస్తున్న వార్షానికి ఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రధాన రహదారిపై అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. ఈ సందర్భంగా తమసీల్దార్ రాజమనోహర్ రెడ్డి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేశారు. కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి వేశారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కోరారు. ముఖ్యంగా జాలరులు, పశువుల కాపర్లు గోదావరి, వాగుల పరివాహ ప్రాంతాలకు వెళ్లకూడదని ఆయన సూచించారు. లక్షెట్టిపేట విద్యుత్ శాఖ ఏడి ఎ.ప్రభాకర్ జన్నారం ఏఈ లచ్చన్న ఇనుప విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకూడదని సూచించారు.

నిరాడంబరంగా క్వారీ దుర్గాదేవి జాతర

- వర్షంతో తగ్గిన భక్తుల రద్దీ



నవతెలంగాణ-హాజీపూర్

క్వారీ దుర్గాదేవీ జాతర నిరాడంబరంగా ఆదివారం ప్రారంభమైంది. ప్రతి ఏడాది ఘనంగా జరిగే ఈ జాతరకు వర్షం ఆటంకంగా నిలవడంతో భక్తుల తాకిడి చాలా వరకు తగ్గింది. ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన దుర్గాదేవి జాతరలో ఆలయ సన్నిధానంలో చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇక హాజరైన భక్తులంతా కూడా దుర్గామాతకు మొక్కులు తీర్చుకుని, తమ వాహనాలకు పూజలు జరుపుకున్నారు. ఇక జాతరకు హాజరైన భక్తులు అక్కడే వంటలు చేసుకుని, ఆనందోత్సాహాల మధ్య సామూహిక వనభోజనాలు చేశారు. భక్తులు ప్రతి ఏడాది ఎంతో పవిత్రతో దుర్గాదేవికి పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పోచమ్మ ఆలయం, నాగదేవత ఆలయాలను కూడా దర్శించుకున్నారు. పలు స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మంచినీళ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. ఏది ఏమైనా జనసంద్రంగా మారాల్సిన క్వారీ ప్రాంతమంతా వర్షంతో బోసిపోయింది. ఎక్కడా కూడా ఖాళీ లేకుండా చెట్ల కింద వంటలు చేసుకునే పరిస్థితులు లేకుండా పోగా కేవలం అమ్మవారి దర్శనం చేసుకుని వెళ్లారు.

పెద్ద సంఖ్యలో ప్రముఖుల రాక

క్వారీ దుర్గాదేవి జాతరకు భక్తులతో పాటు పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి ఇటు ఎంసీసీ అధికారులు, అటు ప్రజాప్రతినిధులు, మంచిర్యాల పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కౌన్సిల ర్లు జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సిలాల్, అశోక్, నరేందర్, నరేష్ కుమార్, సత్యనారాయణ, 8 మంది ఎస్సైలు 50 ఇతర పోలీస్ సిబ్బందితో జాతర ఏర్పాటుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంచిర్యాల డిపో నుండి రెండు బస్సులు నడిపించారు.





బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

ఎంపీడీఓ దత్తారాం తండ్రి కిషన్ మహారాజ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ ఆదివారం ఉట్నూర్‌లోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మాజీ సర్పంచులు హరినాయక్, సునీల్ జాదవ్, కనక వెంకటేశ్వర్‌రావ్, బానోత్ ఆత్మారాం, లక్ష్మణ్, ప్రతాప్, శ్రీధర్, గోవింద్ ఉన్నారు.

అగస్టు 5లోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

రైతు బీమా చేసుకునే రైతులు ఆగస్టు 5వ తేది లోగా దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సంగీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త పట్టాదారు రైతులకు జూన్ 28 వరకు పట్టా పాస్‌బుక్ వచ్చిన వారికి ఇంతవరకు కూడా రైతు బీమా చేసుకోకపోయినా రైతులు మాత్రమే రైతు బీమా చేసుకోవాలన్నారు. గతంలో భీమా చేసుకున్నా రైతులు బీమాలో మార్పులు చేర్పులు-ఆధార్‌లో లేదా నామిని చనిపోతే మార్పులు కొరకు మాత్రం చివరి తేది జూలై 30 వరకు ఉందన్నారు. కొత్తగా పాసుబుక్ వచ్చిన రైతులు మాత్రమే రైతు బీమా ధరకాస్తూ చేసుకోవాలన్నారు. రైతు బీమా చేసుకోవడానికి కావాల్సిన పత్రాలు దరకాస్తు ఫారం రైతు పట్టా దారు పాస్ బుక్ లేదా తహసీల్దార్‌తో డిజిటల్ సంతకం అయినా డిఎస్ పేపర్, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, నామిని మైనర్ అయితే వీరి ఇద్దరివీ ఆధార్ కార్డు జిరాక్స్‌లు ఏఈఓ సమక్షంలో దరకాస్తు మీద సంతకం చేసి ఇవ్వాలన్నారు. 14 ఆగస్టు 1965 నుండి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే ఈ రైతు బీమాకు అర్హులు అన్నారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాలు వయస్సు ఉన్న రైతులు మాత్రమే బీమా చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సారంగాపూర్ : ఇప్పటి వరకు రైతు బీమా దరఖాస్తు చేసుకొని, రైతులు ఆగష్టు 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అలాగే కొత్త పట్టాదారు రైతులు జూన్ 28 వరకు పట్టాబుక్ వచ్చిన వారు, ఇంతవరకు రైతు బీమా చేసుకొనివారు మాత్రమే రైతు బీమా చేసుకోవాలని పేర్కొన్నారు. గతంలో బీమా చేసుకున్నా రైతులు బీమాలో మార్పులు చేర్పులు, ఆధార్‌లో లేదా నామిని చనిపోతే మార్పుల కొరకు జూలై 30లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అందుకు కావాల్సిన పత్రాలు, రైతు పట్టాదారు పాస్‌బుక్ లేదా తహసీల్దార్‌తో డిజిటల్ సంతకం చేసిన పత్రం, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జాతచేయాలని తెలియజేశారు. 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే రైతు బీమాకు అర్హులు, ఆధార్ కార్డులో 18 సంవత్సరాలు నుంచి 59 సంవత్సరాలు వయస్సు ఉన్న రైతులు మాత్రమే బీమా చేసుకోవాలని వెల్లడించారు.

భారీ వర్షానికి ఇంట్లో చేరిన వరదనీరు

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన నీలం నర్సయ్య ఇంట్లోకి ఆదివారం వరదనీరు వచ్చి చేరింది. ఉదయం ఇంట్లోకి, గొర్రెల పాకలోకి చేరింది. ఉదయం 3 గంటల ప్రాంతంలో నీరు చేరడంతో ఒక్కసారి నిద్రలో నుంచి లేచి కుటుంబ సభ్యులు ఉలిక్కి పడ్డారు. తెల్లవారే వరకు కుటుంబ సభ్యులు మేలుకొని ఉన్నారు. సదర్మాట్ కాంట్రాకర్ అవసరం లేని వద్ద కల్వర్టు నిర్మించవద్దు అని తెలిపిన కల్వర్టు నిర్మించారని అన్నారు. మరో కల్వర్టు నిర్మిస్తామని చెప్పి కల్వర్టు నిర్మించకుండా, బీటీ రోడ్డు పనులు కూడా నిలిపివేశారని స్థానికులు, బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. పప్పు, బియ్యం వంట సామాగ్రి పూర్తిగా తడిసిపోయాయని అన్నారు. ఇకనైనా కల్వర్టు నిర్మించి, వర్షపు వరద నీరు ఇండ్లలోకి రాకుండా అధికారులు చూడాలని కోరారు.

అభివృద్ధికి దూరంలో కాలనీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపాలిటీ నుంచి సరైన నిధులు కేటాయించకపోవడంతో వీలీన కాలనీలు అభివృద్ధి చెందలేదని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నిల్వగా ఉన్న నీళ్లను పరిశీలించారు. ఈ మేరకు కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో వీలీన కాలనీలలో సరైన రోడ్లు, మురుగు కాలువలు లేక పరిస్థితి మరింత ఘోరంగా ఉందన్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. గతంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో వీలీన వార్డులు అభివృద్ధి చెందలేదన్నారు. అంతకు ముందు టీచర్స్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణిమ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ యాదవ్, కాలనీ వాసులు ఉన్నారు.

గ్రామ సభ నిర్వహించిన అధికారులు



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర గ్రామంలో గ్రామీణ ఉపాధిహామీ సామాజిక తనిఖీలో భాగంగా ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు చేసిన పనులు, హరిత హారంలో భాగంగా నాటిన మొక్కల గూర్చి డీఆర్పీ చిరంజీవి గ్రామ సభలో వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఏపీఓ జగన్, ఈసీ అనిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన మల్టీపర్పస్ వర్కర్ రాథోడ్ యశ్వంత్‌రావ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ కార్యదర్శి కొల రాజశేఖర్ బాధిత కుటుంబానికి రూ.3వేలను తనవంతుగా ఆర్థిక సాయంగా అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్థిక సాయం అందించిన పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు పలువురు అభినందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో గ్రామ పంచాయతీ కారోబారి జాదవ్ దినేష్, మల్టీ పర్పస్ వర్కర్ ఉన్నారు.